ఈ వారం కథ

# వికలాంగులు

- అమ్మన సత్యప్రసాద్

ఏ మాత్రం కోపంకానీ, విసుగుకానీ, నిరాశకానీ వ్యక్తంచేయని ఆయన పెద్ద మనసుని చూసి నాకెంతో సంతోషం వేసింది. వికలాంగులకు కృత్రిమ అవయవాలు తయారుచేసి వారి అవిటితనాన్ని మరపింపజేస్తున్న మనుషులే, వారి అవిటితనాన్ని గుర్తుచేసి బాధించడం చిత్రంగా అనిపించింది.

పెట్రోల్ సేవ్ చేయడం కోసం ఆ రోజు కారు ఇంటిదగ్గర వదిలేసి ఆఫీస్‌కి బస్‌లో బయల్దేరాను. సిటీబస్‌ల రాకపోకలు చెప్పలేం కదా! ముందుగా బయల్దేరి బస్‌స్టాప్‌కి చేరాను. చేంతాడులా పొడుగ్గా వున్న "క్యూ"లో నిల్చున్నాను.

అరగంట నిరీక్షణ తరువాత సిటీబస్ దుమ్ము రేపుకొంటూ తనదైన బాణీలో వచ్చి ఆగింది. అప్పటి వరకూ "క్యూ"లో వున్న ప్రయాణికులు తోసుకుంటూ ఎక్కడం మొదలు పెట్టారు. ఆ తోపుడులో ఒక వ్యక్తిని త్రొక్కుకుంటూ పట్టించుకోకుండా ఎక్కడం గమనించాను. చేతి ఆసరా ఇచ్చి అతనిని లేవతీశాను. ఆయనకి సుమారు 55 సంవత్సరాల వయస్సు వుంటుంది. ఏదో ప్రైవేట్ కంపెనీలో పని చేస్తున్నాడట. జనాలు బాగా త్రొక్కెయ్యడం వల్ల బాగా నీరసించి నిల్చోలేక పోతున్నాడు. అప్పుడు ఆయనని పరిశీలనగా చూశాను. ఒక కాలు మోకాలు వరకు తీసేసినట్లు గ్రహించాను.

బస్ విపరీతమైన రద్దీగా వుంది. ఆయనను తీసుకొని వెళ్ళి ఒక సీటులో నిద్రపోతున్న ఒక పెద్ద మనిషిని లేపి ఆయనకు సీటు ఇవ్వమని రిక్వెస్ట్ చేశాను. మంచి నిద్రలో వుంటే చెడగొట్టావన్నట్లు నా వైపు గుర్రుగా చూశాడు. నా కళ్ళతో వెనుక ఆయన వైపు చూపించాను.

ఆయనను క్రింద నుండి పై వరకూ పరిశీలనగా చూసి "వికలాంగులకి కేటాయించిన సీటు ముందుంటుంది" అంటూ ఒక ఉచిత సలహా ఇచ్చాడు లేని నవ్వుని తెచ్చి పెట్టుకొంటూ - ఆ పెద్ద మనిషి.

అతనిపై నాకు విపరీతమైన కోపం వచ్చింది. ప్రతి సమస్యకి పరిష్కారం కోపం కాదుగా! కోపాన్ని అణచుకొని ఆయనని తీసుకొని ముందుకు వెళ్ళాను.

వికలాంగులకి కేటాయించిన సీటులో కూర్చుని దేని గురించో తీవ్రంగా చర్చించుకుంటున్నారు ఓ ఇద్దరు. "సర్! సీటు ఖాళీ చేసి వీరికి చోటి



వ్వరా!" అన్నాను అర్థింపుగా. నా వైపు ఒకసారి చూసి వినిపించనట్లుగా మళ్ళీ చర్చలో మునిగిపో యారు వాళ్ళు. మళ్ళీ అడిగాను. "మేము బస్ స్టార్టింగ్ పాయింట్ నుండి కూర్చుని వస్తున్నాం. సీటు ఎందుకు ఖాళీ చెయ్యాలి?" అన్నాడు ఒక తను గట్టిగా.

"ఇది వికలాంగుల సీటు" అని చెప్పి ఆయనకి తన అవిటి తనాన్ని గుర్తు చేసి ఆయన మనస్సు బాధపెట్టడం ఇష్టంలేక, వస్తున్న కోపాన్ని అణచు కొని కళ్ళతోనే వెనుక ఆయన వైపు చూపించాను.

ఆయనను చూసి "ఫిజికల్లీ హాండీకేప్డా? మరి చెప్పొచ్చుగా! అలా కళ్ళతో సైగలు చేస్తారెం దుకండీ?" అంటూ లేవబోయాడు ఆ వ్యక్తి.

ఇవన్నీ వింటున్న ఆయన ఆ వ్యక్తితో "పర్లేదు. మీరు కూర్చోండి" అని నా వైపు తిరిగి "నాకు ఇలా నిల్చుని వెళ్ళడం రోజూ అలవాటేనండీ. ఇంకో పది నిమిషాల్లో నేను దిగాల్సిన స్టాప్ వస్తుంది" అన్నాడు.



ఏ మాత్రం కోపం కానీ, విసుగు కానీ, నిరాశ కానీ వ్యక్తం చేయని ఆయన పెద్ద మనసుని చూసి నాకెంతో సంతోషం వేసింది. వికలాంగులకి కృత్రిమ అవయవాలు తయారుచేసి "మీరు విక లాంగులు కారు" అని వారికి తమ అవిటితనాన్ని మరపింప చేస్తున్న మను షులే "మీరు వికలాం గులా?" అని వారి అవిటితనాన్ని గుర్తుచేసి వారి మనస్సు బాధపెట్టడం చిత్రంగా అనిపించింది నాకు.

నేను ఒత్తిడి చేయడంతో ఆయన సీటులో కూర్చున్నాడు. నేనుదిగాల్సిన స్టాప్ వస్తుందనగానే "మీ ఆఫీస్ వరకూ రమ్మంటారా?" అని అడి గాను., "అవసరం లేదండీ, నేను వెళ్ళిపోగలను" అని కృతజ్ఞతా పూర్వకమైన చూపులతో చెప్పాడు. దిగాల్సిన స్టాప్ రావడంతో ఆయన వద్ద సెలవు తీసుకొని బస్ దిగాను.

ఆ రోజు సాయంత్రం ఆఫీస్ నుండి వచ్చేస రికి "డాడీ" అంటూ పాకుతూ ఎదురొచ్చాడు మా బాబు. వాడికి అయిదేళ్ళు. చిన్నప్పుడు పోలియో రావడం వల్ల నడవలేదు. వాడిని చూడ గానే ఉదయం జరిగిన సంఘటనే గుర్తుకు వచ్చి కళ్ళలో నీళ్ళు గిర్రున తిరిగాయి.

మా బాబులాగే ఆయన కూడా వికలాంగుడు కావటం వల్లనేమో! ఆయనకి సహాయం చేశాను. లేకపోతే మిగతా వారిలాగే ప్రవర్తించి వుండేవాడి నేమోనని అనిపించింది. దాని గురించే నాలో నేనే ప్రశ్నించుకున్నాను. ఎంత ఆలోచించినా ఆప్రశ్నకి సమాధానం దొరకలేదు.

రెండు రోజుల తరువాత మా కాలనీవాళ్ళు "విక లాంగ సంక్షేమ సంఘం" అధ్యక్షుడైన శ్రీ దయాని ధిగారికి వికలాంగుల సంక్షేమానికి ఆయన చేసిన సేవలకి గుర్తింపుగా సన్మానం జరుపుతున్నారని తెలిసి, నేను కూడా ఆ సభకి వెళ్ళాను. సన్మానం జరుగుతున్న వ్యక్తిని చూడగానే నాకు కళ్ళు తిరి గినంత పనయింది. నిశ్చేష్టుడనై పోయాను.

రెండు రోజుల క్రితం బస్‌లో సీటడిగితే, 'విక లాంగులకి కేటాయించిన సీటు ముందుంటుం దని' ఉచిత సలహా ఇచ్చిన పెద్ద మనిషే! ◆

## అల్లుడి జోక్స్

* అత్తగారి కొంగు చివరనున్న తాళాల గుత్తి చూసినప్పుడల్లా ఇల్లరికపుటల్లుడి మనసు బరువెక్కి పోతోంది.

"అత్తా! గుత్తికుండే బరువెంత?" అన్నాడు ఆశగా.

"నెత్తిమీద పెట్టుకున్న చెత్తకన్నా తక్కువే నాయనా!" అంది వెంటనే.



* పండక్కొచ్చిన అల్లుడు ఎన్ని పెట్టినా మూలుగుతూనే వున్నాడు. అసలేదో అనుమానంతో దిగులుగా వున్నాడని మావగారు ముద్దుగా "నాయనా! నీ శంకకు మూలమే మిటి?" అన్నాడు.

"ఏదీ కాదు – నాకు మూల శంక."

* అప్పుడే అత్తవారింటి నుంచి దిగుతున్న అల్లుణ్ణి చూసిన ఒకావిడ: "ఏమిటండీ అతనికి గూనా పాపం!" అంది.

"కాదే! అత్తారింటి నుంచి తెచ్చుకుంటున్న పెట్టె బరువుకి అలా అయిపోయాడు."

* "అమ్మాయి ఏమని రాసిందండీ ఉత్తరం?"

"నాన్నా! పోయినసారి పండక్కి కొనిచ్చిన స్కూటరు మీద నుండి పడి పన్ను విరిగిందట. ఈసారి పండక్కి ఆయనకి బంగారప్పన్ను చేయించాలట అని."

బద్దిగం పాండురంగారెడ్డి, కరీంనగర్